మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం: ఎమ్మెల్యే గొండు

విశాలాంధ్ర - గార: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని వమరవల్లి పంచాయతీ గొర్రెలవానిపేటలో సోమవారం కమ్యూనిటీ భవనం, రోడ్లకు ఎమ్మెల్యే శంకర్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో గ్రామాల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడంతో గ్రామాల్లో రోడ్లు, కాలువలు శిథిలావస్థకు చేరి పోయాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గార మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఉద్దానం ప్రజల జీవనాధారాన్ని ధ్వంసం చేయొద్దు

కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి బాధిత గ్రామాల ప్రజలతో వామపక్షాలు ధర్నా

విశాలాంధ్ర - పలాస: పలాస నియోజకవర్గం మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని సముద్ర తీరానికి ఆనించి ఉన్న సుమారు 20 గ్రామాలకు చెందిన ప్రజల జీవనాధారాన్ని ధ్వంసం చేయవద్దని, కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని బాధిత గ్రామాల ప్రజలతో పాటు పలు వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పలాస ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వేల మంది రైతులకు సంబం ధించిన జీవన్మరణ సమస్య అని, ఉద్దానం రైతాంగానికి చెందిన సుమారు 1400 ఎకరాల భూమికి సంబంధించిన అంశమని అన్నారు. ఉద్దానం తీర ప్రాంతంలో కార్గో ఎయిర్పోర్ట్ నిర్మాణం ద్వారా రైతుల జీవన మనుగడే ప్రశ్నార్థమవుతుందని, సన్నకారు, చిన్నకారు రైతాంగంగా ఉన్న రైతులు అధికారుల వద్ద మొర పెట్టుకున్న వారిలో స్పందన కరువైందని అన్నారు. ఉద్దానం రైతులు కొబ్బరి, జీడి, మునగ, పనస వంటి పంటలపై ఆధారపడి జీవనాన్ని కొనసాగిస్తున్నారని, ఈ భూముల్లోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్గో ఎయిర్పోర్ట్ నిర్మాణానికి సంబంధించి ప్రయ త్నాలను మొదలుపెట్టడం సరికాదని, వారి ప్రతిపాదనను వెంటనే విరమిం చుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎయిర్ పోర్ట్ ఏర్పాటు నెపంతో సారవంతమైన భూములు సేకరించి తీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నంలో ఉన్నారని వారు ఆరోపించారు. 2007లో ప్రారంభించిన ఆఫ్షోర్ రిజర్వాయర్ పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నారని పలాస ప్రాంతానికి గోరంత నీరు కూడా ఇవ్వలేకపోయారని వారు ఎద్దేవా చేశారు. అభివృద్ధి ముసుగులో ప్రజల ఆస్తులను కొల్లగొడితే సహించేది లేదని రైతుల పోరాటాన్ని దశలవారీగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మూలపేట పోర్టుకు సేకరించిన భూముల్లో 300 ఎకరాలు కేటాయిస్తే బలవంతపు భూసేకరణ అవసరం లేదన్నారు. ఇప్పటికీ అధికారులు దిగి రాకపోతే ఈనెల 23న జిల్లా కలెక్టరేట్ వద్ద ప్రజా పరిరక్షణ కమిటీ నాయకులతో పాటు వామపక్ష పార్టీల నాయకులు కలిసి బలవంతపు సేకరణ వ్యతిరేకంగా ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, సిపిఎం నాయ కులు గోవిందరావు, వామపక్ష పార్టీలకు చెందిన నాయకులు తాండ్ర ప్రకాష్, గణపతి, వంకల మాధవరావు, పోతనపల్లి కుసుమ, తెప్పల అజయ్ కుమార్, మద్దిల రామారావు, వినోద్, మోహన్రావు, జుత్తు వీరాస్వామి, కొమర వాసు, దుర్యోధన, పురుషోత్తం, జోగి అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలి

విశాలాంధ్ర - నరసన్నపేట: పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచేలా పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని మండల విద్యా శాఖాధికారి-2 పి.దాలినాయుడు అన్నారు. సోమవారం మండలంలోని పెద్ద బొరిగి వలసలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన రికార్డులను పరిశీలించారు. జిల్లా విద్యా శాఖాధికారి తిరుమల చైతన్య ఆదేశాల మేరకు పదవ తరగతి చదివే విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచేలా పాఠ్యాంశాలు బోధించాలని తెలిపారు. ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు ధీటుగా ర్యాంకులు సాధించాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిట్ట గంగన్న, ఉపాధ్యా యులు పి.జ్యోతి, జి.ఆదినారాయణ, ఎ.అప్పన్న, పి.శ్రీధర్, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఛైర్మన్ గొండు ప్రసాద్, వైస్ ఛైర్మన్ సతివాడ సునీత తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం విజయవంతం

విశాలాంధ్ర - కొత్తూరు: విజయవాడలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హైందవ శంఖారావం సభ పెద్ద ఎత్తున విజయవంతం కావడంతో పాతపట్నం నియోజకవర్గం బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపింది. పాతపట్నం బీజేపీ నేత సిరిపురం తేజేశ్వరావు ఆధ్వర్యంలో పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు హిరమండలం, ఎల్.ఎన్ పేట, పాతపట్నం, మెలియపుట్టి మండలాలు నుండి వివిధ వాహనాల్లో ఐదు వందల మంది వరకు హిందూ అభిమానులు హాజరయ్యారు. కాగా బీజేపీ పార్టీలో సిరిపురం చేరి ఇంకా ఏడాది కాలం కాకముందే పాతపట్నం నియోజక వర్గంలో తనకంటూ ఒక స్థానం సంపాదించుకున్నారు. జిల్లా, రాష్ట్ర నాయకుల సమన్వయంతో సిరిపురం ముందుకు సాగుతున్నారు.

డొక్కా సీతమ్మ మిడ్డే మీల్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర - హిరమండలం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన డొక్కా సీతమ్మ మిడ్డే మీల్స్ భోజనం పథకాన్ని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కూడా మధ్యాహ్నం భోజనంను ప్రభుత్వం ప్రవేశ పెట్టడంతో ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థుల పట్ల సానుకూలంగా ఉందని ప్రతీ విద్యార్థి చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు, అధ్యాపకులకు పేరు ప్రఖ్యా తలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వేగం కన్నా భద్రత మిన్న

విశాలాంధ్ర - సోంపేట: రోడ్డు ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భద్రత పాటించాలని, సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సోంపేట ఎస్ఐ లవరాజు పేర్కొన్నారు.

పట్టణంలో సోమవారం కుమార్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రయాణంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు, నిబంధనలు పాటించాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్య ప్రయాణం, ప్రమాదాలకు హేతువులని అన్నారు. లైసెన్స్ లేని ప్రయాణం నేరమని పేర్కొన్నారు. ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

వరి చేను కుప్ప దగ్ధం

విశాలాంధ్ర - నందిగాం: కనితివూరు గ్రామం గిన్ని మల్లేష్‌కి చెందిన 1.90 ఎకరాల వరిచేను ఆదివారం దగ్ధమైంది. కుప్ప కాలుతూ పొగలు రావడం చూసిన కొంత మంది మంటలు ఆర్పివేసినప్పటికీ కుప్ప లోపల మొత్తం కాలిందని మల్లేష్ తెలిపారు. ఎవరో కక్ష కట్టి కుప్పకి నిప్పు పెట్టారని వివరించారు. విషయం తెలుసుకున్న నీటి సంఘం అధ్యక్షుడు కవిటి విశ్వనాథం రెవెన్యూ అధికారులకు సమాచారం అందించగా విఆర్వో ప్రసాద్ 70 వేలుకు నష్టాన్ని అంచనా వేసినట్లు తెలుస్తోంది.

విజేతలకు బహుమతులు అందజేత

విశాలాంధ్ర - కవిటి: కవిటి కొత్తూరు కళ్యాణి జూనియర్ కళాశాలలో యాజమాన్యం ఆధ్వర్యంలో మెగా టాలెంటు టెస్టును నిర్వహించి సోమవారం ఫలితాలను ప్రకటించారు. మండలంలోని 20 పాఠశాలల నుండి 250 విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి బి.పవిత్ర, ద్వితీయ బహుమతిని శిలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎన్.చరణ్, తృతీయ స్థానంలో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి హర్షిని నిలిచారు. వారికి సోమవారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.మల్లేశ్వరరావు, కళ్యాణి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకరరావు, యాజమాన్యం, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐతమ్‌లో నూతన పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - టెక్కలి: ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సిఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా విధులు నిర్వహిస్తున్న గంటి విజయకుమార్, మొదలవలస దివ్యలు నూతనంగా రచించిన 'డేటా వేర్ హౌసింగ్ అండ్ డేటా మైనింగ్' అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి.నాగేశ్వరరావు సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సిఎస్ఈ, ఐటి, సిఎస్ఎం, ఈసిఈ విద్యార్థులకు ఈ పుస్తకం చాలా ఉపయోగపడుతుందని డైరెక్టర్ అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు, సమాజానికి ఉపయోగపడే మరిన్ని పుస్తకాలను రచించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పుస్తకావిష్కరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఆరెండీ డాక్టర్ డి.శ్రీరాములు, సిఎస్ఈ హెచ్ఓడి డాక్టర్ వై.రమేష్, బోదన, బోదనేతర సిబ్బంది అభినందించారు.

క్విజ్ పోటీల్లో సత్తా చాటిన కొత్తపల్లి

విశాలాంధ్ర - మందస: జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పలాస మండలం గురుదాసుపురంలో జరిగిన జిల్లా స్థాయి క్విజ్‌లో తృతీయ స్థానంలో నిలిచి షీల్డ్‌తోపాటు 5వేల రూపాయలు బహుమతి గెలిచారు. వజ్రపుకొత్తూరు మండలం హుకుంపేటలో జరిగిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో తృతీయ స్థానం సాధించి షీల్డ్‌తో పాటు 3వేల రూపాయలు బహుమతులు గెలుపొందారని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు గవ్వ భీమారావు ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం: మీకోసం (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) అర్జీలు పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని, అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) మీకోసం కార్యక్రమం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జరిగింది. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజుతో కలసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. అర్జీల పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ కె.భారతీ సౌజన్య, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి.ప్రసాదరావు, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి అనురాధ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.టి.వి.బాల మురళీ క్రిష్ణ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతిశ్రీ, డ్వామా పి.డి బి.సుధాకర్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత

- ఈవో వీరభద్ర స్వామి

విశాలాంధ్ర - కవిటి: కవిటి మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యానిక అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఈవో వీరభద్ర స్వామి తెలిపారు. ఈ మేరకు సోమవారం కవిటి గ్రామపంచాయతీ పరిధిలో గల ప్రగఢపుట్టుగ గ్రామంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో జంగిల్ క్లియరెన్స్, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించారు. చెత్త చెదారం ట్రాక్టర్ సహాయంతో తరలించారు. అనంతరం బ్లీచింగ్ చల్లారు.

బయో మెడికల్ వేస్టేజ్‌పై దృష్టిసారించండి: కలెక్టర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం: బయో మెడికల్ వేస్టేజ్ పై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బయో మెడికల్ వేస్టేజ్ పై ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని నెలలకు ఒకసారి ఇన్స్పెక్షన్ చేస్తారని కలెక్టర్ అడుగగా ఆరు నెలలకు ఒక సారి ఇన్స్పెక్ట్ చేస్తామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ వివరించారు. ఎన్ని తనిఖీలు చేశారని, ఎన్నో సమస్యలు ఉంటాయని వాటిపై దృష్టి సారించాలని ఆదేశించారు. బయో మెడికల్ పై తనిఖీ చేసిన డేటా అందజేయాలన్నారు. బయో మెడికల్‌పై ఏ విధంగా చార్జ్ చేస్తారని కలెక్టర్ అడుగగా బెడ్స్ ప్రకారం చార్జ్ చేస్తామని చెప్పారు. ఆర్ ఎం పి డాక్టర్లుతో ఒక సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులు నుండి వచ్చే బయో మెడికల్ వేస్టేజ్‌పై డిసిహెచ్ కలెక్టర్‌కు వివరిం చారు. వచ్చే సమావేశం నాటికి రైంబో నుండి ఎంత వస్తుంది ఎంత రావాల్సి ఉందని తెలియజేయాలని ఈఈని ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ నుండి, పంచాయతీల నుండి బయో మెడికల్ వేస్టే మేనేజ్ మెంట్ ను ఎక్కడ నుండి ఎంత వస్తుంది ఎంత రావాల్సి ఉందని తేడా తెలియజేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ షకీలకు తెలియజేశారు. ప్రతీ రోజు 45 కేజీల వరకు బయో మెడికల్ వేస్టేజ్ తీసుకువెళతారన్నారు. ఒక్కో బెడ్ కు ఎంత వస్తుందని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ నెల రైంబోకి బయో మెడికల్ వేస్టేజ్ ఎంత ఇచ్చారో ఆ రశీదు తీసుకోవాలని చెప్పారు. ఏజన్సీకి బయో మెడికల్ వేస్టేజ్ సరిగా వెళుతుందా లేదా చూడాలన్నారు. వచ్చే సమావేశం నాటికి వివరాలతో రావాలని ఆదేశిం చారు. జెమ్స్ ఆసుపత్రి నుండి ఎంత వేస్టేజ్ వస్తుందని అడిగి తెలుసుకున్నారు.

ఆసుపత్రుల నుండి ఎంత బయో మెడికల్ వేస్టేజ్ ప్రతీ రోజు ఎంత ఇస్తారో రికార్డు మెంటైన్ చేయాలన్నారు. ముందుగా ఆసుపత్రుల బయో మెడికల్ వేస్టేజ్ పై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణ శ్రీ కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రుల నుండి డిసిహెచ్ ఎస్ కళ్యాణ్ బాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ షకీల, ఆయా ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

విశాలాంధ్ర - పోలాకి: మండలంలో ఇటీవల ప్రమాదాలకు గురైన బాధిత కుటుంబాలకు మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. దీర్ఘాశి గ్రామానికి చెందిన పల్లి రమణయ్య ఇటీవల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందిన కుటుంబానికి లక్ష రూపాయలు చెక్కును, వెదుళ్ళవలస గ్రామానికి చెందిన పల్లి కృష్ణమ్మ కుడి కాలు

సర్జరీ కోసం 33,752 రూపాయలు చెక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నీటి సంఘం అధ్యక్షులు మిరియాపిల్లి వెంకట ప్పలనాయుడు, మాజీ ఏఎంసి చైర్మన్ బైరి భాస్కర్‌రావు, ఎంపీడీవో రవికుమార్, పల్లి సూరిబాబు, సూరపు రాందాస్, మజ్జి లక్ష్మీనారాయణ, లుకలాపు రాంబాబు, గొర్లె ఎర్రయ్య పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కరించాలి

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో 42 ఫిర్యాదులు అందాయి. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోను జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాకుళం పట్టణ డీఎస్పీ సిహెచ్ వివేకానంద ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన ప్రజా ఫిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కరించాలని పోలీసు అధికారులను సూచించారు. ప్రజల నుంచి 42 ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ కాల్స్ ద్వారా తక్షణమే తెలియపరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. ఈ క్రమంలో డీఎస్పీ స్వయంగా అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలన్నారు.

ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ ఆస్తులు

- నిర్లక్ష్యం వహిస్తున్న స్థానిక అధికారులు

విశాలాంధ్ర - జలుమూరు: ప్రభుత్వ ఆస్తి అమాత్రం ఉందంటే అతి తొందరగా ఆక్రమించడానికి కోకొల్లలుగా ఆక్రమిత దారులుగా అవతారం ఎత్తుతున్నారు. జలుమూరు మండలం చిన్న దూగాం జంక్షన్ నుండి తిలారు రైల్వే స్టేషన్‌కి వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా గల ప్రభుత్వ ఆస్తిని పలువురు వ్యక్తులు ఆక్రమించారు. అనేక ప్రాంతాల నుండి వ్యాపారాల కోసం వచ్చిన వారు ముందుగా చిన్న పాటి పాకలు వేసి ఆ తర్వాత విద్యుత్ సరఫరాకు నీటి సర ఫరాకు పాల్పడు తున్నారు. నిరంతరం ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉన్న రహదారి ఈ ఆక్రమ నిర్మాణం వలన ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పాతపట్నం, నరసన్నపేట ప్రధాన హైవే రహదారి పెద్ద దూగం జంక్షన్‌పై రోజు రోజుకు ఆక్ర మణలు జోరందుకున్నాయి. గతంలో అధికారులు వీరికి నోటీసులు ఇచ్చి తూతూ మంత్రంగా కాలం గడిపినందున ప్రస్తుతం మరింత ఆక్రమణలు జోరందు కున్నాయి. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరారు.

వెనుకబడ్డ విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర - హిరమండలం: కేజీబీవీలో వెనుకబడ్డ విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపాలని సర్వ శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డా ఎస్.శశిభూషణ్ తెలిపారు. హిరమండలం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. కేజీబీవీలో రికార్డులను, తరగతి గదులను పరిశీలించారు. టెన్త్, ఇంటర్ విద్యా ర్థినీల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు. శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణ వేణి, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

మృతుడు కుటుంబానికి జెడ్పీ చైర్పర్సన్ పరామర్శ

విశాలాంధ్ర - కవిటి: మండలంలోని కమలాయి పుట్టుగ గ్రామానికి చెందిన బచ్చు ఢిల్లీరావు (58) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న జెడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా బచ్చు ఢిల్లీరావు చిత్రపటానికి పిరియా విజయ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సనపల కృష్ణారావు, బచ్చు ధనుంజయ్, ఇసురు మోహనరావు, రాంపత్ని చంద్రశేఖరం, బచ్చు దుర్గారావు, బచ్చు పాపారావు, గిన్ని సీతారాం, శాడి దోన్నయ్య, బెందాళం డిల్లిబాబు, గోరుసు దేవరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కస్పావీధిలో బుసలుకొడుతున్న డయేరియా

- బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే కూన రవికుమార్

విశాలాంధ్ర - పొందూరు: మండల కేంద్రం కస్పావీధిలో సోమవారం డయేరియా లక్షణాలు బుసలు కొట్టాయి. శ్రీశైనవాడలో పదేళ్ల లోపు పిల్లలు వాంతులు, విరేచనాలతో సొమ్మసిల్లారు. అదే సమీపంలో ఉన్న రజకవాడలో బాధితులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డయేరియా సోకిన వారిలో అధిక సంఖ్యలో చిన్న పిల్లలుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆ ప్రాంతాన్ని పర్యవేక్షించారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పిల్లలకి ఇబ్బంది కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఆదేశించారు. బాధితవాడల్లో సిబ్బంది పర్యవేక్షణ తప్పనిసరి కావాలన్నారు. సేవలందించడంలో నిర్లక్ష్యం చేస్తే క్షమించేది లేదని హెచ్చరించారు. వీధుల్లో పరిసరాల పరిశుభ్రపరచాలని సంబంధిత పంచాయతీ సిబ్బందిని హెచ్చరించారు. కాచిన చల్లార్చిన వేడి నీళ్ల సేవించాలని సూచనలు ఇచ్చారు. అవసరమైన చోట రక్త నమూనాల సేకరణ చేయాలన్నారు. వీధుల్లో నీటి గుంటలు, రోడ్ల పైన పశువులు, చెత్త చెదారం లేకుండా చూసే బాధ్యత పంచాయతీ పాలకవర్గం చూసుకోవాలని ఆదేశించారు.

ప్రధాని మోదీ పర్యటన విజయవంతం చేద్దాం: ఎన్ఈఆర్

విశాలాంధ్ర - రణస్థలం: ప్రధాని మోదీ విశాఖ పర్యటన విజయవంతం చేద్దామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఈనెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖ రానున్న నేపథ్యంలో రణస్థలం మండలం నడుకుదిటి పాలెంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో సోమవారం కూటమి నాయకులు, అధికారులతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోయే విధంగా చేద్దామని అన్నారు. ఉత్తరాంధ్ర వైభవాన్ని చాటి చెప్పే విధంగా ఉండాలని అన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రధానమంత్రి మోదీ శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గం మొత్తం 115 బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సభకు బస్సులో వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు ఎదురైన తన క్యాంపు కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ కూడా ఏర్పాటు చేయడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పిసిని జగన్నాథం నాయుడు, ముప్పిడి సురేష్, మల్లేష్, మౌళి శ్యామలరావు, తహశీల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులకు శత శాతం భరోసాగా నిలవండి

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర - ఆమదాలవలస: బాలల హక్కుల పరిరక్షణకు శత శాతం భరోసాగా నిలవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. నూతనంగా చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం పేరిట ప్రభుత్వ రిజిస్ట్రేషన్ లాంఛనాలు పూర్తిచేసుకున్న ఈ సంస్థ ప్రతినిధులు సోమవారం ఉదయం ఆమదాలవలసలోని స్వగృహంలో ఆయన చేతులమీదుగా సంస్థ పేరు, లోగో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తమ్మినేని సీతారాం మాట్లాడుతూ బాలలపై రాష్ట్రంలో నిత్యం వెలుగులోకి వస్తున్న దాడులు దండనలు, ఉల్లంఘనలు, లైంగిక కార్యకలాపాలను గమనిస్తే మరిన్ని నూతన బాలల హక్కులు వారి సంక్షేమానికి పోరాటాలు చేసేందుకు చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం లాంటి సంస్థలు ముందుకొచ్చి ఆవిర్భావించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు జి.ధనలక్ష్మి మాట్లాడుతూ తమ సంస్థ రాష్ట్రంలోని ఏ బాలల హక్కుల సంఘానికి పోటీ కాదని, బాలల హక్కులు, వారి సంక్షేమంపై పోరాటాలే కీలకంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు తమ్మినేని చిరంజీవి నాగ్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రోసె క్యూషన్స్ మెట్ట మల్లేశ్వరరావు, బాలల సంఘాల నాయకులు కొత్తకోట శ్రీనివాసరావు, బి.లవకుశ, బచ్చు లక్షణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 250 జీడి పరిశ్రమల్లో పని చేస్తున్న జీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని క్యాష్యూ లేబరు అసోసియేషన్ కోరింది. ఈ మేరకు సోమవారం పలాస తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తికి క్యాష్యూ లేబరు అసోసియేషన్ వినతిపత్రం అందజేసింది. జీడి కార్మికులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు కల్పించాలని, ఇ.ఎస్.ఐ మరియుల పి.ఎఫ్, గ్రాడ్యూటీ తదితర పథకాలు అమలు చేయాలని, కార్మికులకు కనీస మౌళిక సదుపాయాలు యాజమాన్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు శిష్టు గోపి, ప్రధాన కార్యదర్శి అంబటి ఆనందరావు, బమ్మిడి సంతోష్‌కుమార్, గజ్జి బాలయ్య, పి.ప్రకాష్‌లు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు పూర్తి చేయాలి
పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

విశాలాంధ్ర - మందస : మండలంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు పూర్తిచేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సోమవారం మందస తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌతు శిరీష మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు మందస మండలం లో ఇప్పటి వరకు 15200 పూర్తి చేశారని జనవరి 12 వ తేదీ లోగా 20000 సభ్యత్వాలు పూర్తి చేయాలని కోరారు. అలాగే ఈ నెల 8 వ తేదీన విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో జరగనున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భావన దుర్యోధన,జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, రట్టి లింగరాజు,లబ్బ రుద్రయ్య,తమిరి భాస్కరరావు,డొంకురు తిరుపతి, రాజన మహేష్, ముడుమంచి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ హైందవ శంఖారావంలో కొత్తూరు టీడీపీ నేతలు

విశాలాంధ్ర - కొత్తూరు : విజయవాడ హైందవ శంఖారావం కార్యక్రమంలో కొత్తూరు టీడీపీ నేతలు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు ఆధ్వర్యంలో పలువురు పాల్గొన్నారు. బహిరంగ సభలో రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షులు స్వామి శ్రీనివాసనంద సరస్వతిని, రాష్ట్ర బీజేపీ పార్టీ అధ్యక్షులు మరియు ఎంపీ దగ్గుపాటి పురంధేశ్వరిని, ఎంపి జివిఎల్ నరసింహం,బీజేపీ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు, ఎమ్మెల్సి పి వి ఎన్ మాధవరావు, ఆర్ఎస్ఎస్ సత్యన్నారాయణ రాజు,మధుకర్జీ మర్యాదపూర్వంగా కలవడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమంలో ఇక్కడ మీడియాతో లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు మాట్లాడుతూ పాతపట్నం నియోజక వర్గంలో హిందూ బంధువులందరూ హాజరయ్యారని, అలాగే దేశంలో ముందు ముందు హిందువులందరూ ఏకతాటిపైకి వచ్చి హిందూ హక్కులను పొందడానికి కృషచెయ్యాలని అన్నారు. త్వరలో గ్రామాల్లో కూడా కమిటీలు వెయ్యడం జరుగుతుందని అన్నారు. అలాగే లోతుగెడ్డ తులసి వరప్రసాద్‌రావు ఈ కార్యక్రమంలో హాజరై విజయవంతం చేసిన పాతపట్నం నియోజక వర్గంలో ఉన్న హిందూ బంధువులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు లోతుగెడ్డ లక్ష్మి నారాయణ నాయుడు, కొయిలాపు సంజీవరావు, డాక్టర్ సలాన శరత్ కుమార్, గేదల మన్మదరావు, లోతుగెడ్డ శ్రీరాం దూతం, కలమట శ్రీరాములు, పొగిరి రవి, చోడవరపు రామనుజం, ఇసై ప్రశాంత్ కుమార్ మొదలగు వారు ఉన్నారు.

మైనర్‌ను గర్భవతిని చేసిన వ్యక్తికి రిమాండ్

విశాలాంధ్ర - ఆమదాలవలస : మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించి గర్భవ తిని చేసిన కోటిపల్లి రాజును పోలీసులు అదుపులోకి తీసుకొని సోమవారం కోర్టులో హాజరు పరిచే రిమాండ్ కు తరలించి నట్లు డీఎస్పీ సిహెచ్ వివేకానంద తెలిపారు. సోమ వారం స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ నిందితుడు గత కొంతకాలంగా అమ్మాయిని ప్రేమ పేరుతో వంచించి గర్భవతిని చేశాడు. తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీసులు ఆశ్రయించారు. పోలీసుల కథనం ప్రకారం నిందితుడు రాజు ప్రేమ పేరుతో పలుమార్లు కలుసుకున్న మాట వాస్తవమేనని ఆ పిల్లతో వివాహం చేసుకునేందుకు తల్లిదండ్రులు ససేమిరా అనడంతో ఆమెను గర్భవతిని చేసి అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు. తల్లి కే. రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు పై పోస్కో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. రాజు నూడిల్స్ షాపులో పనిచేసుకుంటున్నాడని తెలిపారు. మైనర్ బాలికను తల్లిదండ్రుల సహాయంతో పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించామన్నారు. ప్రభుత్వపరంగా బాలికకు రావలసిన అన్ని పథకాలను అందే విధంగా నివేదిక అందించమన్నారు. ఆయనతోపాటు సీఐ ఎస్సై సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - టెక్కలి : ఆడపిల్లలని రక్షిద్దాం, ఆడపిల్లలని చదవనిద్దాం అనే నినాదంతో మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చాకిపల్లి లో ప్రధానోపాధ్యాయురాలు ఎం.అనురాధ ఆధ్వర్యంలో కేస్ వర్కర్ కుప్పిలి ప్రసన్న రాణి వన్ స్టాప్ సెంటర్ల ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు సమాజంలో మహిళలు, ఆడపిల్లలను చదివించడంతో పాటు, వారి స్వీయ రక్షణకై - విద్యార్థినులకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, సురక్షిత స్పర్శ, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, గృహ హింస, మానవ అక్రమ రవాణా, అత్యాచారాలు వంటి పలు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. నిరాశ్రులకులు అయిన ఆడపిల్లలకు, మహిళలకు జిల్లా మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ వారు నిర్వహిస్తున్న హెూమ్స్ ఉన్నాయని తెలిపారు. ఆడపిల్లలకు మహిళలకు ఎటువంటి కష్టం కలిగిన 100,1098, 181,112 హెల్ప్ లైన్ నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. బాలికలు ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని తెలిపారు. ఆపద సమయంలో ఉన్న మహిళలకు ఆపన్నహస్తంగా ఒన్‌స్టాప్ సెంటర్లు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం మహిళ కానిస్టేబుల్ ప్రమీల ఉపాధ్యాయులు కే.నారాయణరావు, పి. ఋషి, పి.చిన్నారావు, కే.మురళీకృష్ణ, ఆర్.జ్యోతి, కే.సుధారాణి, మోహిని, బాడాన నారాయణరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ ఉత్సవాల్లో ఆకట్టుకున్న రాజమ్మ

విశాలాంధ్ర - సోంపేట : విశాఖపట్నం జిల్లా ఆరిలోవలో సంగీత జానపద కళాపీఠం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సంక్రాంతి జానపద సంబరాల్లో ఉద్దానం ప్రాంతం కవిటి మండలం గొండ్యాల పుట్టుగ గ్రామానికి చెందిన గేదెల ప్రకాష్ ప్రదర్శించిన రాజమ్మ వేషం అందరిని ఆకట్టుకుంది. ఒక్కొక్క కళాకారునికి కొద్ది నిముషాలు కేటాయించగా ప్రకాష్ రాజమ్మ పాత్రలో ప్రదర్శించిన హావభావాలు, నృత్యం అందరినీ ఆకర్షించింది. నిర్వాహకులు మెమెంటోతో సత్కరించారు.

సీతయ్య ఫౌండేషన్‌కు ఎస్‌విజె విద్యార్థులు వితరణ

విశాలాంధ్ర - కవిటి : కవిటికి చెందిన ఎస్విజె విద్యా సంస్థల విద్యార్థులు సీతయ్య ఫౌండేషన్‌లో ఆశ్రయం పొందుతున్న వయోవృద్ధుల అన్నదానం కోసం సోమవారం ఉపాధ్యాయుల సౌజన్యంతో విద్యార్థులంతా కలసి 50 కేజీల బియ్యంను అందజేశారు. ఈ సందర్భంగా సీతయ్య ఫౌండేషన్ వారు విద్యార్థులు అన్నదానం కోసం పలు సందర్భాల్లో బియ్యం అందజేసినందుకు విద్యార్థులకు ప్రత్యేక దన్యవాలతో పాటు అభినందనలు తెలియజేశారు.

బాలకృష్ణమ్మ సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర - కవిటి : ఉపాధ్యాయుల జీవితాలలో వెలుగు కిరణం,ఫెడరేషన్ కి ఊపిరిగా నిలిచి ఉద్యమాలతో ఉపాధ్యాయుల బ్రతుకు మార్చిన మార్పు బాలకృష్ణమ్మ సేవలు చిరస్మరణీయమని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 అధ్యక్షుడు బల్ల ధర్మారావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కవిటి ప్రాంగణంలో మార్పు బాలకృష్ణమ్మ 12వ వర్ధంతి సమావేశం నిర్వహించి నివాళులు అర్పించారు. మార్పు బాలకృష్ణమ్మ చేసిన సేవలు కోసం ఉపాధ్యాయులు చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ సీనియర్ కార్యకర్తలు బల్లెడ లక్ష్మణమూర్తి, కొత్తపల్లి రంగారావు, మొద్రి గోపి, గుడియ వంశీ, శ్రీరామ్ మూర్తి బిసాయి, పొల్లాయి వాసు, భార్గవ్, విజయకుమార్ పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి సభను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర - నరసన్నపేట : భారతదేశ ప్రధాన మంత్రి, నరేంద్ర మోడీ ఈ నెల 8వ తేదీన విశాఖపట్నంలో ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమావేశంలో టీడీపీ, జనసేన, బిజేపి రాష్ట్ర, జిల్లా, మండల, క్లస్టర్ ఇంఛార్జీలు, యూనిట్ ఇంఛార్జ్‌లు, ముఖ్య నాయకులుతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, రమణమూర్తి మాట్లాడుతూ విభజన హామీలైన విశాఖ రైల్వే జోన్‌కు సంబంధించిన శంఖుస్థాపన, విశాఖ మెట్రో జోన్, అనకాపల్లిలో ఫార్మా సిటీ తదితర ప్రోజెక్టులకు ప్రధాని, మోడీ

శంఖుస్థాపన చేయునున్న సంధర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ మన నరసన్నపేట నియోజకవర్గం తరపున నాలుగు మండలాల నుండి నరసన్నపేట పట్టణంలో వార్డులు నుండి భారీ సంఖ్యలో ప్రజలందరూ పెద్ద సంఖ్యలో హాజరయ్యే విధంగా జన సమీకరణ చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయితీ వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, నరసన్నపేట వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్, శిమ్మ చంద్రశేఖర్, జనసేన నియోజకవర్గ ఇంఛార్జ్, బలగ ప్రవీణ్‌కుమార్, టిడిపి నాయకులు, పంగ బావాజీనాయుడు, జల్లు చంద్రమౌళి, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, పూతి రమణ, పూణ్ణ వేంకటేశ్వరరావు, బోయిన సతీష్, భైరి భాస్కరరావు, పీస కృష్ణ, బగ్గు గోవిందరావు, జామి వెంకటరావు, మిరియాపల్లి అప్పలనాయుడు, కన్నేపల్లి ప్రసాదరావు, బెవర రాము, సకలాభక్తుల గోవిందరావు, అడపా చంద్రశేఖర్, బతకల గోవి, బొజ్జమ్మ, గుణుపురం రామలక్ష్మీ పాల్గొన్నారు.

ఇంటికో వ్యాపారవేత్తే లక్ష్యం : ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ఇంటికో వ్యాపారవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు 2047 విజన్ సిద్ధం చేశారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఏడురోడ్ల కూడలి జంక్షన్‌లో డ్వాక్రా బజారును సోమవారం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి యజమానిగా ఉన్న భర్త వ్యవసనాలకు అలవాటు పడితే ఆ కుటుంబం మొత్తం చిన్నాభిన్నం అయిన పరిస్థితులను చంద్రబాబునాయుడు చూశారన్నారు. ఆ పరిస్థితుల నుంచి ఆ కుటుంబాలను రక్షించాలంటే మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలని తలచి చంద్రబాబునాయుడు డ్వాక్రా సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. నాటి ఆ ఆలోచనే నేడు ఓ కుటుంబానికి ఆర్థికవేత్తగా మహిళలందరూ ముందుండి నడిపిస్తున్నారని పేర్కొన్నారు. లక్షలాది రూపాయలు రుణం పొంది మహిళలు కుటుంబాలను ఆర్థిక బలోపేతం చేస్తున్నారని వివరించారు. నాడు చంద్రబాబునాయుడు 2020 విజన్ ప్రవేశపెట్టినప్పుడు కొందరు హేళన చేశారని, కానీ నేడు ఇంటికో సాఫ్ట్‌వేర్ ఉన్నారని చెప్పారు. ఆనాడు హైటెక్ సిటీ నిర్మిస్తున్న సమయంలో కొండల్లో కట్టేశారని కొందరు నవ్వారని నేడు అది ఎంతమందికి ఉపాధిని ఇస్తోందో మీరే చూస్తున్నారు కదా అని తెలిపారు. 2047 విజనరీ డాక్యుమెంటరీని ప్రారంభించి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే చంద్రబాబు ముందుకు సాగుతున్నారని వివరించారు. ఇప్పుడు మహిళలే శక్తి వంతులని, ఏ ప్రభుత్వం వచ్చినా డ్వాక్రా సంఘాల మహిళలకు అదనపు పథకాలు ప్రకటిస్తుందే తప్ప ఆ పథకాన్ని ఎత్తివేయాలనే ఆలోచన కూడా చేయడం లేదంటే చంద్రబాబునాయుడు మహిళలకు అందించిన సహకారం అటువంటిదని చెప్పారు. ప్రతీ ఒక్క కుటుంబం నుంచి ఒక వ్యాపారవేత్త రావాలంటే మనం చంద్రబాబునాయుడు పై నమ్మకంతో తోడ్పాటును అందించాలని కోరారు. భవిష్యత్‌లో శ్రీకాకుళం నియోజకవర్గంలో రూ.100 కోట్ల డ్వాక్రా మహిళలకు రుణాలు అందజేస్తామని హామీనిచ్చారు. డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో

సిక్కోలు డ్వాక్రా బజార్‌ను ఏర్పాటు చేశారు. ఈ డ్వాక్రా బజారు ఈ నెల 6 నుంచి 11 వరకు కొనసాగుతుందని తెలిపారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఈ డ్వాక్రా బజార్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. మహిళా స్వయం సేవా బృందాలు తయారుచేసిన వస్తువులను ఈ డ్వాక్రా బజార్లో విక్రయిస్తారని చెప్పారు. అలానే రైతులు, చేతి వృత్తిదారులు, పొందూరు చేనేత కార్మికులు, వస్తువులను నేరుగా ఈ డ్వాక్రా బజార్లో అమ్మకాలు చేపడుతున్నారు. డ్వాక్రా బజారు ఒక్కొక్క స్టాల్‌కు ఒక్కొక్క ప్రత్యేకమని చెప్పారు. కొయ్య బొమ్మలు, చెక్క బొమ్మలు, చేనేత వస్త్రాలు, పొందూరు ఖద్దరు, ఆత్రేయపురం పూతరేకులు, మందస కోవా, పలాస జీడిపప్పు, జనపనార బ్యాగులు, మట్టి గాజులు, సహజ సిద్ధంగా తయారుచేసిన పచ్చళ్లు, పట్టు వస్త్రాలు, మాడుగుల బెల్లం, గోపి మంచూరియా, పట్టు వస్త్రాలు, సిక్కోలు ప్రజలు తయారుచేసిన డెకరేషన్ ఫ్లవర్స్, బాపట్ల పట్టు వస్త్రాలు, అరకు కాఫీ పొడి, బొమ్మల కొలువు, ఇంట్లో వినియోగించే పింగాణి వస్తువులు, ప్లేట్లు, గ్లాసులు, చేతి వృత్తులచే తయారుచేసిన మట్టి గ్లాసులు, మట్టి పాత్రలు, మట్టి కుండలు ను అమ్మకాలకు ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, అరవల రవీంద్ర, మాదారపు వెంకటేష్, రెడ్డి గిరిజాశంకర్, పాంద్రంకి శంకర్, కెల్లా కొండలరావు, పాల్గొన్నారు.

విద్యార్థులు అంతర్గత భయాలు జయించాలి
చిన్మయ మిషన్ ప్రతినిధి, పూజ్యస్వామి పరాత్మనంద

విశాలాంధ్ర - నరసన్నపేట : విద్యార్థులు వారి అంతర్గత భయాలు జయిస్తేనే వారు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారని, బాహ్య వికాసం కంటే అంతర్గత వికాసం ఎంతో ముఖ్యమని, చిన్మయ మిషన్ ప్రతినిధి, పూజ్య స్వామి, పరత్మనంద అన్నారు. సోమవారం స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో చిన్మయ యువ కేంద్ర ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస శిక్షణలో భాగంగా లైఫ్ స్కిల్స్ అంశంపై విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజ్య స్వామి, పరత్మనంద మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందాలని, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని సూచించారు. తమలో అంతర్గతంగా దాగి వున్న శక్తిని వెలికితీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, సిహెచ్.దుర్గాప్రసాద్, చిన్మయ మిషన్ సభ్యులు, శ్రీవత్స, చైతన్య, నారాయణ చైతన్య, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్వీఆర్ డిగ్రీ కళాశాలలో...

స్థానిక ఎల్వీఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం చిన్మయ యువ కేంద్ర

ఆధ్వర్యంలో విద్యార్థులకు లైఫ్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, ఎం.ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాశ శిక్షణ తరగతులు నిర్వహించటం ఎంతో అవసరమని, అవి విద్యార్థుల మూర్తిత్వాన్ని పెంపొందించటానికి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. కళాశాల ఎకడమిక్ డైరెక్టర్, జి.వి.జగన్నాధరావు మాట్లాడుతూ ఇటువంటి శిక్షణా తరగతులు నెలకి ఒకసారైనా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, డి.కోటేశ్వరరావు, ఎస్.ప్రభాకరరావు, ఎస్.ఆనందరావు, ఎస్.రాము, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మామిడి బిజీబిజీ

విశాలాంధ్ర - కొత్తూరు : పాతపట్నం ఎంఎల్ఏ మామిడి గోవిందరావు సోమవారం కొత్తూరు మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో శంఖు స్థాపనలు, ప్రారంభోత్సవ కార్యాక్రమల్లో పాల్గొని బిజీబిజీగా గడిపారు ముందుగా నివగాం హై స్కూల్ లో నియోజకవర్గ బాల బాలికల క్రీడా పోటీలను ప్రారంభించారు ఆనంతరంవసప స్కూల్ ఆవరణంలో కంప్యూటర్ ల్యాబ్ రూమ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు తరువాత కొత్తూరు జూనియర్ కాలేజీలో డొక్కా సీతమ్మ మిడ్ డే మిల్ భోజనం పథకాన్ని ఎంఎల్ఏ మామిడి ప్రారంబించారు తానే విద్యార్థులు కు వడ్డన చే సారు వేగం గా పెందాలాడే లేచి తమ కొడుకు. కూతురు కు.లంచ్ బాక్స్ పెట్టాలన్న హడావుడి తల్లులకు తప్పింది అని ఎంఎల్ఏ మామిడి అన్నారు.

స్వర్ణాంధ్ర సాధన దిశగా రాష్ట్రంలో చంద్రబాబు పాలన
తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

విశాలాంధ్ర - ఆమదాలవలస : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర సాధన దిశగా పయనిస్తోందని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. సోమవారం మధ్యాహ్నం ఆముదలవలస లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రజల అకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ముఖ్యంగా ఎన్నికల హామీల లో భాగంగా సామా జిక పింఛన్లను 3000 నుంచి 4000 రూపాయ లకు పెంపు, ఐదు రూపాయలకే పేదలకు అన్నం పెట్టి ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తెచ్చిందన్నారు. గత దీపావళి నుంచి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ ల పంపి ణీ కూడా ప్రారంభించింది అన్నారు.గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన వైఖరి కారణంగా ఖజా నా ఖాళీ అయినప్పటికీ చంద్రబాబు నాయుడు ముందు చూపు , పరిపాలన దక్షతతో రాష్ట్రంలో పరిస్థితులు క్రమంగా చక్కబడుతున్నాయన్నారు. వైసిపి ప్రభుత్వం లో జీతం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడిన ప్రభుత్వ ఉద్యోగులకు ఖచ్చితంగా ఒకటో తేదీనే జీతాల చెల్లింపు కొనసాగుతోందన్నారు. తాజాగా విద్యా ర్థులకు కూడా బడి భోజనం పథకం జనసేన విజ్ఞ ప్తితో డొక్కా సీతమ్మ పేరిట ప్రారంభమైందన్నారు. మరో వైపు విశాఖతో రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందే విధంగా కార్యచరణను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

రామ్మోహన్ నాయుడు నేతృత్వంలో ఉత్తరాంధ్ర ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందేందుకు ఆస్కారం... మరోవైపు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు నేతృత్వంలో ఉత్తరాంధ్ర ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఏర్పడిందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ నెల ఎనిమిదో తేదీన

విశాఖపట్నం పర్యటనకు వస్తున్న నేపథ్యం లో ప్రజలలో మరింతగా ఆశావహ దృక్పథం ఏర్ప డిందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఖచ్చి తంగా ఉత్తరాంధ్ర సమస్యలు పరిష్కారానికి, అభి వృద్ధికి దోహదపడే విధంగా విశాఖ వేదికగా కీలక మైన ప్రకటనలు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏది ఏమైనప్పటికీ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ సహాయ సహకారాలతో రాష్ట్రం ప్రగతి పథంలో పయనించడం ఖాయమన్నారు. అయినప్పటికీ కూడా పేదలకు ఐదు రూపాయలతో పట్టెడు అన్నం పెట్టలేకపోయినా గత వైసిపి ప్రభుత్వ నాయకులు.. కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

కష్టపడిన వారందరికీ గుర్తింపు ఉంటుంది... తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారందరికీ తగిన గుర్తింపు ఉంటుందని తెలుగు శక్తి అధ్యక్షుడు బి. వి.రామ్ అన్నారు. అయితే సదరు వ్యక్తులను గుర్తించే క్రమంలో కాస్త ఆలస్యమైనప్పటికీ తప్పకుండా తగిన న్యాయం జరుగుతుందని వ్యాఖ్యానించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అరాచకాలను ఎదిరించిన ప్రతి ఒక్కరికి తెలుగుదేశం పార్టీలో తగిన గుర్తింపు, గౌరవం లభిస్తుందని బి.వి.రామ్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

మందస కొయ్య బొమ్మలకు జిల్లా స్థాయి గుర్తింపు

విశాలాంధ్ర - మందస : స్వయం శక్తి సంఘాలు చిన్న బరంపురం గ్రామంలో తయారు చేసిన హస్తకళలు, కొయ్య బొమ్మలుకు జిల్లాస్థాయి లో ఏర్పాటు చేసిన సిక్కోలు డాక్రా బజారులో మంచి గుర్తింపు వచ్చినట్లు ఏపిడి పైడి కూర్మారావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ డ్వాక్రా బజారుకు వచ్చిన అతిథులను, సందర్శకులను మంచి ఆకర్షణీయంగా ఆకట్టు కున్నట్లు తెలిపారు. తయారుచేసి తీసుకొని వచ్చిన మహిళా సంఘ సభ్యులు దగ్గర బాగా సరకు అమ్ముడుపోయినట్లు వివ రించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు గోండు శంకర్‌తో పాటు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పాదక సంచాలకులు కిరణ్ కుమార్, ఐటీడీఏ అదనపు పదక సంచా లకులు సన్యాసిరావు, క్లస్టర్ కోఆర్డి నేటర్లు తారక మోహన్, స్వామి నాయుడు, ముఖలింగం, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాంతమ్మ సంబంధిత వి.వో.ఏ.లు పాల్గొన్నారు.

తోలాపిలో గుండెపోటుతో సీఆర్పీఎఫ్ హెచ్‌సీ మృతి

- సీఆర్పీఎఫ్ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

విశాలాంధ్ర - పొందూరు: మండలం తోలాపిగ్రామానికి చెందిన సీఆర్పిఎఫ్ హెడ్ కానిస్టేబుల్ బొనిగి రమణారావు (54) సోమవారం స్వగ్రామం తోలాపిలో గుండె పోటుతో హఠాన్మరణం చెందారు. మూడు రోజుల సెలవుపై ఇంటికి వచ్చిన రమణరావు సోమవారం ఉదయం బాత్రూంకువెళ్ళి గుండెపోటుకు గురై పడిపోయారు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రమణరావు చత్తీస్ ఘడ్లోని సీఆర్‌పీఎఫ్ 19వ బెటాలియన్‌లో హెచ్‌సీగా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య జ్యోతి ఇద్దరు కుమారులు ఉన్నారు. రమణరావు మృతిచెందిన సమాచారం అందడంతో సీఆర్‌పిఎఫ్ ఎస్సై పి.తిరుమల, సిబ్బంది చాంద్, రాజేష్పాండే, దేవానంద్, పి సెంథిల్, ఆర్పి అతుల్ తదితరులు సీఆర్పిఎఫ్ అధికార లాంచనాలతో సోమవారం తోలాపిలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలలో అధికసంఖ్యలో తోలాపిగ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

విశాలాంధ్ర-పొందూరు: విశాఖపట్టణంలో ఈనెల 8న జరుగనున్న ప్రధానమంత్రి మోదీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఎల్ ఏ కూన రవికుమార్ కోరారు. సోమవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విశాఖపట్టణంలోని ఏయూ ప్రాంగణంలో నిర్వహించే సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్కళ్యాణ్ ముఖ్య నేతలను హాజరవుతారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరుకావాలని సూచించారు. ఎంఎల్ఏతో పాటు మండలపార్టీ అధ్యక్షులు రామ్మోహన్, పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి శ్రీ రంగనాయకులు, తెలుగుయు వత జిల్లా ప్రధానకార్యదర్శి బలగ శంకర బాస్కర్, మండల పార్టీ ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ఎంఎల్ఏ కూన రవికుమార్

విశాలాంధ్ర - పొందూరు: రాష్ట్రంలో రైతులకు ఎదురవుతున్న భూసమస్యలను పరిష్కరిం చడానికే ప్రభుత్వం గ్రామాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని ఎంఎల్ఏ కూన రవికుమార్ అన్నారు. మండలం ధల్లి పేట గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే పేరుతో రైతులమధ్య భూసమస్యలను సృష్టించారని దీనితో రైతుల మధ్య భూతగాదాలు, విభేదాలు పెరిగిపోయాయని అన్నారు. రెవెన్యూసదస్సులను సద్వినియోగం చేసుకుని భూసమస్యలను పరిష్కరించుకోవాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు, మండల పార్టీ అధ్యక్షులు సీహెచ్ రామ్మోహన్, బలగ శంకరబాస్క ర్. బడి రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరుకల సేవా సంఘం ఉత్తరాంధ్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సూర్యారావు

విశాలాంధ్ర-పొందూరు: ఆంధ్రప్రదేశ్ ఉత్తరాంధ్ర జిల్లాల ఎరుకల సేవాసంఘం కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా మండల కేంద్రం ఎరుకల కాలనీకి చెందిన గొర్లె సూర్యా రావు ఎన్నికయ్యాడు. విశాఖలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి. శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర జిల్లా ల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి. రమణమూర్తి, దాసరి నారాయణమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలలో సూర్యారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు.

జొన్న వలస చెరువులో ఆక్రమణలు తొలగింపు

- ఆందోళన చెందిన నిర్వాసితులు

విశాలాంధ్ర - ఆమదాలవలస: ఆమదాలవలస మండల పరిధి జొన్నవలస గ్రామంలో చెరువు గర్భాలను ఆక్రమించి గృహ నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో రెవిన్యూ అధికారులు పోలీసుల సహాయంతో వాటిని తొలగించారు. 2023లో ఆర్ అండ్ బి రోడ్డును ఆనుకొని, చెరువు గర్భంలో అక్రమ నిర్మాణం చేపట్టరాదని నోటీసులు జారీ చేసినప్పటికీ రాజకీయ పలుకుబడితో యదేచ్ఛగా నిర్మించారు. రెవెన్యూ గ్రామ సర్వేనెంబర్ 108లో 7.10 ఎకరాల తాగు సాగునీటి చెరువును అన్యాక్రాంతం చేశారని స్థానికులు ఆర్డీవో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమదాలవలస రెవెన్యూ అధికారులు 2023లో నోటీసులు అందించారు. రాజకీయ ప్రాబల్యంతో ఆక్రమణలు తొలగించకపోవడంతో సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు సోమవారం రెవెన్యూ అధికారులు పోలీస్ యంత్రాంగంతో సంబంధిత ప్రాంతానికి చేరుకొని జెసిబి లతో అక్రమ నిర్మాణాలను తొల గించారు. ఆర్ అండ్ బి రోడ్డు పక్కన అక్రమంగా నిర్మించి నివాసముంటున్న ఇళ్లను తొలగించారు. అధికారులకు స్థానికులకు మధ్య వాగ్వాదం జరి గింది. పలుమార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ తొల గించక పోవడంతో కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ పోలీస్ యంత్రాంగం సంయుక్తంగా ఆక్రమణలకు తొలగించారు. స్థానికల ఆందోళన మధ్య భారీ పోలీస్ బలగాల మోహరించి వాటిని తొలగించా రు.20 ఏళ్లుగా నివాసముంటున్న వాటిని తొల గించడంపై స్థానికులు ఆందోళన చెందారు. కనీసం ప్రత్యామ్నాయంగా చూపకుండా తొలగించడం ఎంతవరకు సమబాని వైసీపీ నాయకులు సర్పంచ్ ప్రతినిధి గొంటి కృష్ణ అధికారుల వద్ద వివరించారు. కోర్టు ఆదేశాలు పాటిస్తున్నామని ఎమ్మార్వో రాంబాబు తెలిపారు. నిలువ నీడ లేని పేదవారమని ప్రత్యామ్నాయం చూపించకుంటే ఆత్మహత్యలే శరణ్యమని వారు రోధించారు.

అశోకం పర్యాటక కేంద్రంగా మారేనా...!

నేతల మాటలు మూటలేనా...?

విశాలాంధ్ర - జలుమూరు: సారవకోట మండలం గుమ్మపాడు పంచాయతీ ఆశోకం గ్రామ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలని పార్టీలు వేరైనా ఆనాటి ప్రజాప్రతినిధులు హామీలు గుప్పించారు. ఇప్పటికైనా ఆశోకం గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతారా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత వాతావరణం లో ప్రతి గ్రామం కాలుష్యం కోరల్లో కొట్టుమిట్టాడుతుండగా వాటన్నింటికీ భిన్నంగా చక్కని వాతావరణం పచ్చని చెట్లు, ఎత్తైన కొండలు, కాలుష్యం ఎరుగని గ్రామం ఆశోకం గ్రామం. ఈ ప్రాంతానికి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే అరుకు ప్రాంతాన్ని తలపించే విధంగా ఉంటుందని పలువురు పెద్దలు అభిప్రాయ వ్యక్తపరిచారు. గుమ్మ పాడు నుండి ఆశోకం కొండ వరకు సుమారు పది కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ దూరమంతా గతంలో కొండలపై నడుచుకుంటూ ఇంటికి చేరేవారని అక్కడ గిరిజన నేతలు తెలిపారు. గతంలో ఏనుగులు గ్రామంలో దూరి బీభత్సం సృష్టించగా గిరిజన సంస్థ పాలకులు తక్షణమే పరిశీలించి పూర్తిస్థాయిలో సిమెంటు రోడ్డుని ఏర్పాటు చేశారని అక్కడ వారు తెలిపారు. ఇక్కడ ఆరు ఇల్లు ఉన్నాయని, అవి కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. అనేక రకాల చెట్లు పండ్లు పెంచుకుంటూ కాస్త వ్యవసాయాన్ని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పోడు వ్యవసాయంతో కుటుంబాలు పోషన జరుగుతుందని వారు తెలిపారు. వీరికి నిర్మించే రహదారి దాదాపు జిల్లాలో ఏ గ్రామంలో ఉండదని పలువురు స్పష్టం చేశారు. వీరు త్రాగునీరు పురాతన భావి నీటిని వినియోగిస్తుంటారు. విద్యుత్ సరఫరా కూడా ఉన్నది ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ కాలక్షేపం చేస్తున్నామని అంటున్నారు. ఇక్కడ జలరాయ ప్రసిద్ధిఅని ఈ ప్రాంతాల్లో ఎవరు నూతన గృహాలు నిర్మించిన ఇక్కడి నుండి రాయి పట్టుకు వెళ్తారని గిరిజనులు తెలిపారు. సింహాగిరి క్షేత్రంగా విరాజల్లవలసిన ఈ ప్రాంతం అనివార్య కారణాల వలన అక్కడ సింహాచలం గా వెలిసిందని అంటుంటారు. కనుక విశాఖ జిల్లా సింహాచల క్షేత్రం కొండలు ఇక్కడ ఈ ప్రాంత కొండలు సమానంగా కనిపిస్తాయని పెద్దలు అభిప్రాయ వ్యక్త పరిచారు. ఇంతటి అద్భుతమైన ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే శ్రీకాకుళం జిల్లాకే గర్వకారణంగా ఉంటుందని ఈ ప్రాంత వాసులు అంటున్నారు. జిల్లా అధికారులు కేంద్ర రాష్ట్ర నేతలు ఒక్కసారి అశోకం సందర్శించి పర్యాటక కేంద్రంగా మార్చాలని అనేక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

తెలుగులో ఉత్తర్వుల నిర్ణయం హర్షదాయకం

విశాలాంధ్ర - పొందూరు: అన్ని ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు, ఉత్తర్వులూ ఇకనుండి తెలుగులో ఇచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయిస్తూ ఆదేశాలివ్వటం హర్షదాయకమని ఎన్.బి.టి.క్లబ్ జీవిత కాల సభ్యుడు, నామ విజ్ఞానవేత్త వాండ్రంగి కొండలరావు, శ్రీశ్రీ కళావేదిక జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి వావిలపల్లి రాజారావు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. విజయవాడలో ఇటీవల ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో చేసిన విజ్ఞాపనను మన్నిస్తూ మహాసభలు జరిగిన మూడు రోజులకే రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించటం గర్వకారణంగా ఉందన్నారు. ఈ మేరకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అధికార భాషా సంఘాలను ఏర్పాటు చేయాలని కోరారు.రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గతంలో వలె రచయితల పుస్తక ప్రచురణకు ఆర్థిక సాయం చేయాలన్నారు. కనీసం ప్రాథమిక పాఠశాల స్థాయిలో నైనా తెలుగు మాధ్యమాన్ని నిర్బంధం చేయాలని కోరారు.

ఇంటర్మీడియట్ వృత్తి విద్యా కోర్సులు చదువుతున్న వారందరికీ తెలుగు భాషను ఓ సబ్జెక్టుగా ప్రవేశ పెట్టాలన్నారు. తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కొండలరావు, రాజారావు కోరారు.